# వీలునామా

విషాదరావుకు ప్రతిరోజూ పదకొండు గంటలయిన తరువాత తనా ఇల్లువదలి ఊరంతా తిరిగి రావడం పరిపాటి. ఏ రెండో మూడో అయింతర్వాతగాని ఇంటికిరాడు. ఈలోగా కనీసం రెండు సిగిరెట్టు పెట్టెలైనా కాలుస్తాడు.

ఇంటికివచ్చి గదిలో లైటు వేసుకు కూర్చుంటే విసుగు విరామం లేకుండా ఆడుతున్న గడియారం తప్ప మరేమీ అతనికి కన్పించవు. గడియారం గుండె ఇప్పట్లో ఆగేట్టు లేదు అనుకుంటాడు. తన గుండెమాత్రం ఎప్పటికప్పుడు ఆగుతున్నట్టే అనిపిస్తుంది. ట్రంకుపెట్టె దగ్గరకు వెళ్ళి ఓసారి చూశాడు. పెట్టె తెరిస్తే లెక్కలేనన్ని కరెన్సీనోట్లు ఏం ? వెధవ డబ్బు ఎవరికా్కవాలీ ? అనుకుంటాడు. అవి అక్కర్లేదు కాని ఏం కావాలో విషాదరావుకి తెలియడం లేదు. అన్నీ కావాలి అన్నీ అక్కర్లేదతనికి. అతని ముఖం చూస్తే ఎవ మీదనో తీరని కసి ఉన్నవాడులా కన్పిస్తాడు.

విషాదరావుకు ఆవిధంగా ఉండటానికి గల కారణం ఏమిటో తెలియడం లేదు. విషాదరావుకు బోలెడు ఆస్తి ఉన్నది. పెద్ద ఇల్లు. రిటైరయి రెండేళ్ళయింది. నెలకు రెండు వందలు పెన్షను తీసుకుంటున్నాడు. సుఖంగా కాలం గడిపే వాడికి ఇంతకన్నా ఏం కావాలి ?

విషాదరావుకు భార్య పోయి నాలుగేళ్ళయింది. పోనీ భార్యా వియోగంవల్ల కలిగిన దుఃఖమేమో అనుకుంటే అదీ కాదు. ఆమె పోవడమే మంచిదయింది. లేకపోతే బొత్తిగా మన శ్శాంతి ఉండేదికాదు అంటాడు - ఆమె పోయినప్పుడు అతను చలించలేదు. ఆమె చితిదగ్గర కూర్చున్నంతసేపు అతను శూన్యంలోకి చూస్తున్నాడేమో అనిపించింది. బంధువు లెంతో మందో వచ్చారు తనను పరామర్శించడానికి. వాళ్ళందర్నీ అసహ్యించుకున్నాడు. పరామర్శించడం, లేని ఏడుపు తెప్పించుకోవడం ఇదంతా ఆఫీసు 'రొటీన్' వంటిది అతని దృష్టిలో... కొంతమంది బంధువులు వ్రాసిన ఉత్తరాలకు విచిత్రంగా సమాధానం వ్రాసేవాడు. "మీరూ, నేనూ కూడా ఒకప్పుడు చచ్చిపోయేవాళ్ళమే... మీ రనుకున్నంత దుఃఖంలో లేను నేను— నిజానికి మా ఆవిడ చచ్చిపోలేదు. మీరు ఉత్తరాలు వ్రాయకండి" అని. బంధువులకు ఆశ్చర్యం వేసేది ఇతని వాలకం చూసి.

జరిగిన విషయాలను గురించి ఆలోచించడం దేనికి ? అనుకుంటాడు. విపరీతాలేమీ జరగలేదు. అందరివలెనే అతనికీ జరిగింది. మరి విషాదరావులోని ఈ విషాదానికి కారణం కన్పించడం లేదు.

కొడుకులను తనదగ్గర ఉండొద్దని ముగ్గుర్నీ మూడు త్రోవల పంపించివేశాడు. ఒక కొడుకు మేనమామ దగ్గర ఉన్నాడు. ఒక కొడుకు తన చెల్లెలు దగ్గర, మరో కొడుకు

వంటరిగా ఉండి చదువుకుంటున్నాడు. ముగ్గురికీ వాళ్ళడిగినంత ప్రతినెలా పంపిస్తుంటాడు. రాత్రిపూట తిరిగి రావడం అలవాటయిన తరువాత అతని మనసుకు శాంతి లభించడం లేదు. తిరిగివచ్చిన తరువాత గడియారం ఎదురుగా గంటసేపు కూర్చుంటాడు.

విషాదరావు ఆ ఊళ్ళో ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. గడియారం ముందు కూర్చుంటే చిన్న ముల్లూ, పెద్ద ముల్లూ రెండూ చిన్న పాముల్లాగా ఒకప్పుడు పెనవేసికుంటూ ఒకప్పుడు పెనవేసుకోకుండా తిరుగుతున్నట్లనిపిస్తుంది. ప్రతి రోజూ ఒక పువ్వు తీసుకొని వచ్చి గడియారంమీద ఉంచుతాడు. తెల్లవారేటప్పటికి అది వాడిపోతుంది.

అతనితో పరిచయానుభవం కలిగింతరువాత తక్షణం కథ రాద్దాత నుకోవడం నాలోని బలహీనతేమో. ఎందుకంటే, అతన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండానే వ్రాయడం మొదలు పెట్టాను. ఏమయినా ఒకనాటితో అతని మనస్తత్వం అర్థం చేసుకుండేంత శక్తి నాలో లేదు. కథ కదివితే మీరేమైనా రావులోని విషాదానికి కారణం గ్రహించగలరేమో.

సంభాషణనుబట్టి అతను "మానవవాది" అని నిర్ధారణ చేయవచ్చును. ఏదైనా, కథకు సంబంధించిన వరకు అతని గుణగణాలతోనూ ఆశయాలతోనూ మనకు సంబంధం లేదు. నిత్య జీవితంలో జరిగిన ఒక చిన్న సంఘటన కథకు కావాలి. ఆసంఘటనే మీ ముందు ఉంచుతున్నాను దాంతో కథకునిగా నా విధి నెరవేర్చుకున్నట్లే కొంతవరకూ. విషాదరావుని గురించిన విష

యాలు నేను ఎక్కువ సేకరించలేకపోయినా కథకు కావాల్సినంత వరకు ఉన్నయి అని నానమ్మకం. విషాదరావును చూడగానే ఎందుకో Chrles Lamb జ్ఞాపకానికి వచ్చాడు. తరువాత అతనిలో వరుసగా Dickens ను, Hardy ని చూడగలిగాను.

నాకూ విషాదరావుకూ ఒక హోటల్లో పరిచయమైంది. ఆరోజు ఇద్దరమూ భోజనం చేసింతరువాత కిళ్ళీ వేసుకుని నడుస్తున్నాం. విషాదరావు సిగిరెట్టు ముట్టించాడు. సంభాషణ అంత చురుగ్గా నడవడంలేదు. చేతిలో సిగిరెట్టు ఉన్నది. పొగ వస్తున్నది. చూశారా నా వేళ్ళు ఎలా కాలిపోతున్నాయో... వేళ్ళలోంచి చూడండి పొగ లేస్తున్నది... అని నవ్వాడు. నాకు నిజానికి విపరీతమైన భయం వేసింది. ఇంటికి వచ్చి ఆలోచించడం మొదలుపెట్టాను.... ఫ్రెంచి రచయిత 'Jean Paul Sartre' గూడా ఇలాంటి సంభాషణలే తను సృష్టించిన పాత్రలచేత పలికించినట్లు నాకు జ్ఞాపకం. కేవలం విషాదరావు ఎక్కడో చదివిన ఒక నవలలోని పాత్రలాగా కన్పించాడు. ఏదైనా విషాదరావు విషాదరావే. అతన్ని మరొకరితో పోల్చడం అంత సమంజసం కాదు. ఇవన్నీ వదిలేసి అసలు జరిగిన సంఘటనలోకి పోదాం.

విషాదరావుకు కొన్నాళ్ళు సుస్తీ చేసినతరువాత ఇంట్లో ఒక వంటమనిషిని ఏర్పాటు చేసుకున్నాడు. ఆమె పాపం స్వంత మనిషిలాగా సపర్యలన్నీ చేసేది. నేను ఒకసారి కలుసుకున్నప్పుడు అతనన్నాడు. "చూడండి ఆమె పుట్టుపూర్వోత్తరాలు మనకు తెలియవు. కేవలం డబ్బుకోసం నాకు వంట

చేసి పెడుతున్నది. నన్ను స్వంత మనిషిలాగా ఆప్యాయంగా చూస్తున్నది" అని ఆమె విషయంలోగల తన కృతజ్ఞతను వెల్లడించాడు.

ం ం ం

అతను చనిపోయినాడని తెలియగానే చూడడానికి వెళ్ళాను. మొదట నేను చేసినపని - బయట "నిశ్చల - విషాదరావు" అనే బోర్డు ఉండేది - అది తీసివేశాను. ఇల్లంతా బంధువులతో నిండి ఉన్నది. వంటమనిషికూడా విషాదంగా ఒక మూల కూర్చున్నది. జబ్బుగా ఉన్నానని కబురైనా చేయలేదు అని పెద్దకొడుకు నాతో అన్నాడు నేనేమీ మాట్లాడ లేదు.

తరువాత రెండు మూడు రోజులకు విషాదరావు వ్రాసిన వీలునామా బయటపడ్డది. ఆయన దస్తూరిలోనే నాలుగు వాక్యాలకన్నా ఎక్కువ లేవు. "నా స్వార్జితం, ఇల్లూ, పొలమూ నా తదనంతరం అవసాన దశలో నన్ను కనిపెట్టుకుని ఉండి నాకు సపర్యలు చేసిన శ్రీదేవమ్మకు [వంటమనిషి] చెందుతుందనీ, బ్యాంకులో నిలఉంచిన డబ్బుమాత్రం మూడోకొడుకు చదువు నిమిత్తం ఉపయోగించాలనీ, ఆ భారం పెద్ద కొడుకు వహించాలనీ" ఉంది—

వీలునామాను చూసి కొడుకులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. నలుగురూ నాలుగు అభాండాలు వేశారు ఆయనమీద. ఊళ్ళో అనేకులు అనేక విధంగా అనుకున్నారు.

అనుకోవడం సహజం గనుక ఎన్నిరకాలుగానో అనుకున్నారు మీరూ అనుకుంటారు. నాకుమాత్రం ఒక ఘట్టి నమ్మకం ఉంది. విషాదరావు దయార్ద్రహృదయుడనీ, నిష్కల్మషుడనీ. ఏమైనా ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. అందరితో పాటూ నాకూ ఓ అభిప్రాయం ఉంది. మీరు ఏకీభవించక పోవచ్చు దాంతో_విషాదరావు మాత్రం ఇక్కడలేడు. కళ్ళు మూసుకుంటే ఎందుకో నిత్యమూ ఎదురౌతాడు.

సు భా షి ణి